# పరాజిత

**సాయంత్రం** అయిదు దాటింది. మొదటి తారీఖున జీతం పుచ్చుకున్న జీవులన్నీ ఎంతో కొంత ఉత్సాహంతో వేగంగా ఇళ్ళకి చేరుకుంటున్నారు. అందరికన్నా ఉత్సాహంగా వుంది సుమతి. అబ్బ! రెండు వందలపైన తాను సంపాదించింది. తన స్వార్జితం తలచుకోగానే సుమతి హృదయం గర్వంగా ఉప్పొంగింది. తాను ఎన్నాళ్ళనుంచో కలగంటున్న కల ఇన్నాళ్ళకి ఈడేరింది. 'తన జీతంలో ఏం కొనాలి?' అన్న ప్రశ్న ఉదయించింది సుమతిలో. 'అమ్మకి ఒకచీర, తాను ఎన్నాళ్ళ బట్టి కొనుక్కోవాలనుకున్న ఎర్రంచు తెల్ల హైకో చీర కొనుక్కోవాలి. జడలో ఒక ప్రక్కగా ఎర్ర గులాబీ పెట్టుకోవాలి ఒంటి పేట ముత్యాలహారం కొనుక్కు వేసుకోవాలి.' ఇలా ఊహాలతో తేలిపోతున్న సుమతి ఎదురుగా చేనేత సప్తాహం, తగ్గింపు ధరలు దుకాణం కన్పించింది. చేతిలోని రెండు వందల రూపాయల పర్సు బరువుగా, మరీ బరువుగా తోచింది. అప్రయత్నంగా దుకాణంలోకి వెళ్ళింది.

'అమ్మా! ఏం తెచ్చానో చూడు' చంటిపిల్లల ఉత్సాహంతో అడుగు పెట్టింది ఇంట్లోకి. చేటలో బియ్యం ఏరుతున్న సావిత్రి తలెత్తి మళ్ళీ తనపని తాను చేసికో సాగింది. 'అమ్మా! యీ చీరే నాకు, ఇది నీకు. ఈ జాకెట్ గుడ్డలు కమలకి–' తీక్షణంగా ఉన్న తల్లి చూపులకి సుమతి వాక్ప్రవాహం ఆగిపోయింది.

'ఎవర్నడిగి కొన్నావు? నాలుగు రాళ్ళు చేతిలో పడగానే ఒళ్ళుపైన తెలియకుండా ఉందన్న మాట. అవ్వ! ఈ తెల్ల చీరేనా నీవు ఆఫీసుకి కట్టుకెళ్ళేది? పెళ్ళిగాని పిల్లవు. ఇలాంటి చీరెలు కట్టడానికి వీలులేదు. అయినా ఏదో ఆ నాలుగురాళ్ళనా వెనకేస్తే మంచి సంబంధం ముడెట్టచ్చని చూస్తూంటే యిలా చిల్లర మల్లరగా తగలేస్తావా? వయసులో వున్న పిల్లవి ఒళ్ళు కొంచెం దగ్గరుంచుకుంటే మంచిది. నీకు తిండి, బట్ట యివ్వడం బరువై ఉద్యోగం చేయించడంలేదు. లక్షణంగా అజీతమేదో తెచ్చి మీనాన్నగారి

పి. శ్రీదేవి.

చేతిలో పెట్టితే మంచిది.' అని చేట తీసుకు లోపలికి వెళ్ళిపోయింది సావిత్రి.

నెత్తిమీద గంగాభవాని క్రిందకి జారడం మొదలుపెట్టింది. కట్టుకున్న ఊహాసౌధాలు గాలిలో కలిసిపోతూంటే గబగబ గదిలోకి వెళ్ళి తన బాధనంతా తలదిండుతో వెళ్ళగ్రక్కింది సుమతి.

ఇరవై సంవత్సరాల సుమతి మొదటిసారిగా పరిస్థితులతో రాజీకి ఒప్పుకుంది.

రెండు సంవత్సరాల సుమతి కష్టం, అలల్ని, ఆనందాల్ని సమాధి చేసి వయ్యారంగా వెళ్ళి బ్యాంకు లాకర్లో దాక్కుని, ఒక శుభ ముహూర్తాన చంద్రశేఖరం అనే ఎన్. జి. వో. హస్తద్వయంలో చేరింది.

చంద్రశేఖరం రెవెన్యూ డిపార్టుమెంటులో పది సంవత్సరాలుగా గుమాస్తా చేస్తున్నాడు. ఒక మాదిరిగా అందగాడనే చెప్పవచ్చును. ఇద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లి, తల్లి అతని సంపాదనమీద ఆధారపడిన వాళ్ళు. చౌకలో కాస్త చవగ్గా సుమతికి దొరికినవాడు.

తన ఆశలపందిరికి కొత్తచివుళ్ళతో అల్లించి పూయించిన ఆశల పుష్పాల్ని తొలినాటి రాత్రే మూటగట్టి సమూలంగా పందిరి పీకేసి, అచ్చంగా భారతనారి ననిపించుకుందామని నిర్ణయించుకున్నది సుమతి.

సులోచనా రాణి హీరోని అంతరాంతరాల్లో ఆరాధించే సుమతి దీర్ఘంగా శ్వాసించింది తొలివారంలో.

ప్రస్తుతం ఇద్దరు ఒక ఊరివాళ్ళే కాబట్టి ఉద్యోగం మాననక్కరలేదన్నారు. మళ్ళీ ఆశలవిత్తనం వేద్దామని సుమతి యత్నం. కాని చోటు కొత్తది కావడం మూలాన్న సంశయంలో వుంది అదనుకోసం.

'ఏమండీ రేపు జీతాలొస్తాయి, ఎన్నాళ్ళబట్టో తెల్లపుల్ వాయిల్ చీర కొనుక్కోవాలనుకున్నాను. మరి కొనుక్కోనా?' అంది సుమతి బెదురు బెదురుగా. కొత్త పెళ్ళాం. జీతం తొలిగా తీసుకోబోతూ (పెళ్ళాం వచ్చాక) 'రేపు నీకేంకావాలోయ్?' అంటూ మృదువుగా చెక్కిలి కొట్టి అడుగుతాడు తను. తను సిగ్గుగా మూరెడు మల్లెమాల చాలునంటుంది తను పువ్వులతోపాటు కొత్త చీరనీ యిచ్చి అందులో తన అందాలు చూడాలంటాడు.' ఇది సుమతి ఊహాలో ఒక భాగం ఒకప్పుడు. పెళ్ళయి నెలకావస్తున్నా మూరెడు కాదు కదా పది మల్లెలయినా తేవా

అని ఎరగని సుందరుడు శేఖరం.

సుమతి వైపోసారి అదోలా చూసి. 'వచ్చేనెలనుంచి చందా బ్యాంకులో వేయాలనుకుంటున్నానే? అయినా నీకు మొన్న పెళ్ళిలో చీరలు చాలా వచ్చాయేమో? మళ్ళీ యీ దండగ దేనికి?' సుమతికి కళ్ళనీళ్ళపర్యంత మైంది. ఆ కంఠ ధ్వనిలో కరుకు, మాటల్లో విరుపు, సుమతికి గొడ్డలి పెట్టే అయింది. ఎన్నో ఊహాలు ఉక్కిరిబిక్కిరి చేస్తోంటే కిటికీదగ్గరగా వెళ్ళినుంచుంది.

తనని ఆప్యాయంగా దగ్గరగా తీసుకుని చెవిమెలిపెడ్తూ 'అమ్మాయ్ నేను లక్షాధికారినికాను. మామూలు మనిషిని. ఎన్. జీ. వో ని మనం చాలా క్రింది తరగతిలో వున్నాం. నాబాధ్యతలు తెలుసుగా? మరినా అర్ధాంగివి కనుక నా బాధ్యతలు నీవు కూడాను.' అయినా తొలిసారిగా కాబట్టి నీ కోరిక చెల్లిస్తాను. ఇక నుంచీ నీనా జీతభేధాలుండకూడదు తెలుసా?' అని చిలిపిగాను, గంభీరంగాను అంటాడని సుమతి ఊహా భాగం మరోటి

ఆ రాత్రి దీర్ఘంగా గడిచింది సుమతికి,

మానసిక దిగులుతో చిక్కి సగమైంది సుమతి.

తెల్లవారగట్ల అంటే అయిదుగంటలకి అత్తగారితోపాటు లేచి పనులు చేసుకుని, భర్తపనులు చూసేసరికి తొమ్మిదిఅవుతుంది. గబగబభోంచేసి ఇంత ఎదో బాక్సులో పెట్టుకుని బస్సుస్టాండులోవచ్చి నిల్చుంటుంది. ఎలాగో ఆఫీసులో పడి అయిదంటి దాకా పనిచేసి ఇల్లుచేరేసరికి ఆరు అవుతుంది దగ్గర దగ్గర.

ఒకోక్కసారి గట్టిగాను, ఒకోక్కసారి మెల్లగాను 'కోడలువస్తే సుఖ పడమ్మ ననుకున్నాను. ఏదీ! ముఖాన్న రాయద్దు?' అంటూ అత్తగారి సాధింపు వినబడుతుంది. సగం సగం వదిలిన వంటపూర్తిచేసి అందరికీ పెట్టి సర్దుకుని పడుకునేసరికి పది కావస్తుంది ఒకోక్కసారి. యంత్రంలా మారిన యీ జీవితంవల్ల దాంపత్య సుఖమూ యాంత్రికంగానే సాగింది సుమతికి.

ఊళ్లోనే ఉన్న పుట్టిల్లు పరాయి ఊరుగా మారింది. ఎలాగో రెండు సంవత్సరాలు గడిచిపోయాయి,

మరో ఆరు నెలలకి సుమతి కడుపు పండబోతున్నట్లు సూచన చేసింది విధి సుమతికి, ఇన్నాళ్ళూ ఎక్కడో యిగిరిన ఆశాలత మళ్ళీ చిగర్చసాగింది, ఇక ఈ ఉద్యోగ బాధ్యత వదలిపోతుంది. హాయిగా అందరిలా అమ్మచేసి పెడ్తూంటే అయిదునెలలూ

హాయిగా తినవచ్చు. అప్పుడు తను ప్రకృతివేసిన యీ ముద్రతో, అందంగా, నిండుగా ప్రవహించే గోదావరిలా నెమ్మదిగా నడుస్తూంటే....

'ఊళ్ళోనే గదా! తొందరేం? తొమ్మిదోనెల రాగానే వస్తుంది. ఎలాగు అప్పుడు సెలవు పెట్టాలిగా' అంటూ నమ్రతగా అత్తగారికి చెప్తున్న చంద్రశేఖరం మాటలు విని ఈ లోకంలోకి వచ్చింది సుమతి. బాణందెబ్బతిన్న పక్షిలా గిలగిలలాడింది మనసు. ఇంకా ఉద్యోగం చేయాలన్నమాట. ఏదోకసి, విరక్తి కలిసి పిచ్చిదాన్ని చేశాయి సుమతిని. కిటికీకేసి తల గట్టిగా కొట్టుకుంది.

నెలలు గడుస్తున్నాయి. నిండుగా, పచ్చగా యెరవాల్సిన సుమతి, చిక్కి, నల్లబడి పొట్టముందుకి కన్పిస్తూ అదోలా తయారవసాగింది. ఏదో ఒకరోజు వేళకూడి ఏదన్నా చేసి పెట్టినా, వెంటనే ఏదో మాట అనే యడంతో తిన్నది చేదుగా అయ్యేది సుమతికి. చంద్రశేఖరం ధోరణి ఎప్పుడూ ఒక్కటే.

తాత్కాలికంగా సుమతి దిగులును దూరంచేస్తో బాబు పుట్టాడు సుమతికి. వటిచివుళ్ళలాటి చేతుల్ని, కాళ్ళనీ తడిమి అప్యాయంగా ముద్దు పెట్టుకుంది సుమతి. 'నువ్వన్నా నా కోరిక తీర్చరా!' అని అనుకుంది. కాని వాడు అశక్తుడైనాడు.

మూడోనెల వెళ్ళగానే సుమతిని తీసుకువెళ్ళాడు శేఖరం. 'ఇంట్లో అమ్మ, చెల్లివుండగా ఉద్యోగందేనికి మానడం?' అని మళ్ళీ ఉద్యోగంలో చేర్పించాడు. అత్తగారి సాధింపు మరింత ఎక్కువైయింది. ఏనాడో వదిలేసిన చంటిపిల్లల పెంపకం మళ్ళీ సాగించాలంటే ఆమెకి కష్టమేమరి. ఆడబిడ్డ పుస్తకాలు చదివేందుకే తీరనిమనిషి. ఎన్ని తిరస్కారాలైనా ఇంటికిరాగానే పిల్లడి బోసినవ్వులో మర్చిపోయేది సుమతి. ఇప్పుడు భర్త నిర్లక్ష్యం బాధించడంలేదు. సుఖపడవల్సిన రోజుల్లో కూడ చాకిరియేగదా అని అత్తగారి పట్ల సాభూతి కలగసాగింది. అలాగే మనవడి ఆటల్లో తన కష్టం సంగతి మర్చిపోయేది సుమతి అత్తగారు.

మరో రెండేళ్ళు గడిచాయి. పిల్లవాడు తల్లికన్నా నాయనమ్మకే మాలిమి అయ్యాడు. అది సుమతికి ముల్లులా గుచ్చుకుంటూంది. ఆఖరికి తన రక్తంకూడ తనకి ఆనందం కల్గించడం లేదు. ప్రొద్దుట పనిహడావిడిలో, సాయంత్రం రాగానే అలసట పనితో కాస్త పిల్లవాడిని అప్యాయంగా ఎత్తుకుని ఎటైనా తిప్పడం, కబుర్లు చెప్పడం సాగేదికాదు.

ఒకరోజు తనకి బెజవాడ ట్రాన్స్‌ఫర్ అయిందన్న వార్త తెచ్చాడు చంద్రశేఖరం. పీడ విరగడ అయిందని సుమతి సంతోషించింది. ఆ రాత్రి ఉత్సాహంగా 'మంచి యిల్లు త్వరగా తీసుకుని ఉత్తరం వ్రాయండి. అందరం కలిసివుండచ్చు బాబీ మధ్యాహ్నం ఏమన్నాడో....' చెప్పుకుపోతున్న భార్యని చూసి, 'అందరం ఉండడం ఎలా కుదుర్తుంది? నీకు మళ్ళీ ట్రాన్స్‌ఫర్ అంటే చాలా రోజులుపడ్తుంది. అందాక నేను అమ్మ ఉంటాం. దగ్గరేగా. నేను అప్పుడప్పుడు వస్తూంటాను. తమ్ముళ్ళు నువ్వు ఇక్కడే వుందురుగాని' అని మామూలుగా, అతి మామూలుగా చెప్పుకుపోతున్న భర్తని చూసి నిరుత్తరాలయింది.

రోషం, దుఃఖం నేను నేనంటూ పోటీపడ్డాయి. ఎన్నాళ్ళనుంచో అణిచిపెట్టిన ఆవేశం గట్లుతెగిన నదిలా పొంగింది. 'అవును. నేను యిక్కడ, మీరు అక్కడ ఉందాం. అసలు మీకు పెళ్ళాంమీద ప్రేమ నేది ఉంటేగా. అసలు పెళ్ళాం అంటే ఏమిటో మీకు తెలుసా? మీ అవసరాలు తీర్చేమనిషి అనే తెలుసేమో? కాని సరసత తెలియని మీలాంటివారికి అసలు జీవితం అంటే తెలుసా? ఉద్యోగం చేసే పెళ్ళాము అయితే తిండి, గుడ్డబాధకూడ తప్పుతుందని పెళ్ళిచేసుకుంటారేమో! ఈ ఆయిదేళ్ళ కాపురంలో ఒక్కనాడైనా ఆప్యాయంగా పేరుపెట్టి పిలిచారా? మంచి చెడ్డ మాట్లాడేరా? నా మనసు అర్ధం చేసుకుని చిన్న చిన్న కోరికలైనా తీర్చగలిగారా? మీ చెల్లెలు పెళ్ళికోసం, మీ భవిష్యత్ కోసం, నా సరదాల్ని, నా మనస్సుని తాకట్టు పెట్టున్నారని సంగతి తెలీదా? ఏదో ఉన్న ఊళ్లోనేకదా అని యిన్నాళ్ళూ అన్నీ సహించి బ్రతికేను. ఇంక నా వల్లకాదు. మీరు వెళ్ళిపోయాక మరో రోజు ఎక్కువ నేను ఉండను యిక్కడ' అంటూ ముక్కుచీదేసింది.

కాని బెల్లంకొట్టిన రాయిలా ఉండిపోయాడు చంద్రశేఖరం.

మరో పదిరోజుల తర్వాత తల్లిని తనతో తీసుకు ప్రయాణమయ్యాడు.

'సుమతీ! పిల్లాడు నాకే అలవాటు అయ్యాడు. నాకుమాత్రం ఎలా తోస్తుంది ఒక్కత్తికి? నాకూడ తీసుకువెళ్తాను. ఎలాగో ఈ నాలుగు నెలలు కష్టపడితివా, వాళ్ళచదువులు ఓ దరికి చేరతాయి. ఏదో ఓపాటి చూసి కమలకి ముడిపెట్టచ్చు. తొందరపడి వచ్చెయ్యకు సుమా!' అని బండెక్కింది అత్తగారు.

చంపల మీదినుంచి జల జల కన్నీళ్ళు రాలిపోతూంటే వెర్రిదానిలా చూస్తూండిపోయింది సుమతి.